# ★ కొన్ని సమస్యలు ★

* శ్రీమతి చుండూరి రమాదేవి

ఆదివారం ఆదివారం ఆలుబిడ్డలతో ఆనందంగా కాలక్షేపం చేసే పర్వదినం గుమస్తా జీవితంలో ఆదివారమనేది అధికారం దేవుడిచ్చిన మహావరం ఆదివారం నాటి కార్యక్రమం ఏమిటంటే, వారం రోజులనుండి పడ్డ బడలిక తీర్చుకోటానికి ప్రొద్దెక్కి లేవటం, గృహలక్ష్మి అందిచ్చిన అమృతోపమానమైన కాఫీ కసింత గొంతుకులో పోసుకొని అల్లా బజారుకెళ్ళి తిరిగి తిరిగి ఏపన్నెండింటికో యిల్లు చేరటం, భోంచేసి కాస్త నడుంవాల్చి ఒక్క కునుకు తీసేటప్పటికి యిల్లాలు ఏ బజ్జీలో, ఏ దోశలో గరం చా సిద్ధం చేయటం, ఒక్కొక్కటే నోట్లో వేసుకుంటూ, అర్ధాంగితో ఆమాటా యీమాటా ఆడుతూ, చివరికి ప్రణయకలహంలోకి దింపటం మహా సరదాగా వుంటుంది. ఒక్కొక్కప్పుడు ప్రణయకలహం "ఇంతింతై వటుడింతయై" అన్నట్లుగా పెరిగి పెరిగి చివరకి ప్రళయ కలహంలోకి దిగటంకూడా కద్దు

అట్లాంటి దివ్యమైన ఆదివారం రోజున మా అబ్బాయి పుట్టిన రోజు పండుగొచ్చింది మా జానకికి వూపిరాట్టం లేదు తలంట్లు, పిండివంటలు, కొత్తబట్టలు, మధ్యమధ్య పిల్లల హంగామా, చెడుగుడి ఆడుతోంది మధ్యాహ్నం భుక్తాయాసంగా వుండి యిట్టే కన్నుమూసేనో లేదో, "ఏమండోయ్, మీరిల్లా పడుకొని గుఱకపెడుతోంటే ఎట్లా అప్పుడే మూడయింది ముత్తయిదువులు వచ్చే వేళయింది మీరింట్లో వుంటే సిగ్గుపడతారు ఫలహారం చేసి బయటికి నడవండి" అంది మా శ్రీమతి నా తలమీద పిడుగు పడ్డట్టయింది "ఇదేమిరా భగవంతుడా, కాస్త విశ్రాంతిగా పడుకోకుండా యీ యెండలో ఎక్కడికి పోను" అనుకుని "చూడు జానీ, నా యెత్తంత ధనం పోసినా యిప్పుడు కదల్లేను సామానుగదిలోకి ఎవరూ రారుకనుక అక్కడైనా కాస్సేపు పడుకుంటాను, అలికిడి చెయ్యకుండా వుంటాను మీ వేడుకలన్నీ అయిందాకా బయటకు రాకుండా వుంటా" నని ఆమెచే ఏలాగో వొప్పించాను

ఆవిడ ఏకళనుందో సరేనని సామానుగదిలో కాస్తంత చోటుచేసి, పక్కవాల్చి, ఫ్లాస్కులో కాఫీ, టిఫిను ఓ మూల పెట్టి, తలుపు చేరేసి చకాచకాపోయింది నిద్ర చెడిపోయింది బద్ధకంగా అరమూత కన్నులతో పడుకున్నాను అవతల కార్యకలాపాలు మహా జోరుగా సాగుతున్నాయి; అందులో ఆడవాళ్ళ గొంతుకలు సామాన్యమైనవి కాదుగా

"కాంతమ్మగారూ రండి రండి, మీ అమ్మాయి రాలేదేం?"

"వస్తుందండి, తీరా వాకిట్లోకొచ్చేసరికి వెన్నవాడు వచ్చాడు, తూపించుకుని వస్తుంది" "అయితే జానికమ్మగారూ, మీరు అచ్చన్న దగ్గరేనా వెన్న తీసుకునేది?"

"కాదండీ, వాడు సమయానికి రాడు మధ్య మధ్య ఇబ్బంది కలుగుతుంది, అంచేత స్టోర్సు నుంచి నెయ్యి తెప్పిస్తాను"

"అబ్బ స్టోర్సు నెయ్యి మహా చెడ్డ వాసనండీ మా పిల్లలు పూరికేనన్నా తింటారుగాని బజారు నెయ్యి వేసుకోరు. వాడితోనే తంటాలు పడుతున్నాం"

"అంత వాసనగా వుండదండీ, మేం వేసుకోడంలే, వెన్నమాత్రం అంత శ్రేష్ఠంగా ఏడుస్తోందీ? ఏదో ఒక నెయ్యి లేకపోతే మా పిల్లలు ముద్ద యెత్తరు"

"ఏమండోయి కాంతమ్మగారూ, మీ సరోజ వేసుకున్న గౌను రెడీమేడ్ కదూ?"

"అవునండీ"

"అందుకనే అలా వుంది చౌకనుకుంటాం గాని రెడీమేడ్‌వి బాగుండవండీ, మనం చెప్పి కుట్టించుకుంటే పూసినట్టుగా వుంటాయి నేనెప్పుడూ రెడీమేడ్‌వి కొనను"

"మా పిల్ల అల్లా వూరుకోదండీ, దానికెప్పుడు తోస్తే అప్పుడే కొత్త గౌను కావాలి లేకపోతే నానా హంగామా చేస్తుంది అప్పటికప్పుడు ఎవరు కుట్టిస్తారు అదీగాక రెడీమేడ్‌వి చౌకగాదే మనం గుడ్డకొని కుట్టించుకుంటేనే చౌకగా గిడతాయి"

"ఓహోహో, సీతమ్మగారూ రండి రండి ఎన్నాళ్ళకెన్నాళ్ళకి! మా మీద సీతకన్ను వేశారు."

## కొన్ని సమస్యలు

"సీతమ్మగారూ, ఆ చీర యెంతండీ, ఎక్కడ తీశారు?"

"మావారు పట్నంనుంచి తెచ్చారు నూటపది"

"అందుకనే బాగుంది మీకేం అదృష్టవంతులు ఎప్పుడూ పట్టుచీరలే కడతారు"

"ఇంతుందన్న మాటేగాని ఆ లక్ష్మమ్మగారు అనువైన గుడ్డే కొనదు ఎప్పుడూ చౌకబారు చీరలేకాని, పట్టుమని పాతిక రూపాయల గుడ్డయినా కొనదు"

"మనకెందుకు వూరుకోండి ఆవిడ వస్తోంది వింటే బాగుండదు"

ఈ విధంగా మహిళా మణులు వారు వచ్చిన పనే మర్చిపోయి చర్చను ప్రారంభించారు నాకు మాత్రం బుర్రకు పనిగల్పించారు ఏమంటారా?

వెన్నకాచిన నెయ్యేగాని తినని వారి బిడ్డలు సుకుమారులా? ఏ నెయ్యేనా సరే లేకుండా ముద్ద యెత్తని వారి పిల్లలు సుకుమారులా?

ఎప్పుడు కావలిస్తే అప్పుడే గౌన్లు కొనిపించుకునే వారి బిడ్డల గారాబమెక్కువా? అమ్మా నాన్నా అందంగా కుట్టించేదాకా వేచియుండేవారి బిడ్డల గారాబమెక్కువా?

గుడ్డలు విరివిగా ఏ కంపెనీ చీరలో వాడే వాళ్ళు శ్రీమంతులా? ఏడాదికి ఏమూడో నాలుగో పట్టు చీరలతో కాలక్షేపం చేసే వారు శ్రీమంతులా? అన్న ఈ సమస్యలు మాత్రం బుర్ర బద్దలు కొట్టుకున్నా ఏనాటికీ తీరేట్టు కనిపించటంలేదు పైమీద బట్టేసుకుని మా జానకి చెప్పినప్పుడే బయటికిపోతే బాగుండేది. అనవసరంగా బుర్ర పోగొట్టుకొనే స్థితిలో పడ్డాను. ఆనాటి ఆదివారం అల్లా ముగిసింది

---


# కిన్నెర

## సచిత్ర మాసపత్రిక

ఎడిటర్: పందిరి మల్లికార్జునరావు ★ అసిస్టెంట్ ఎడిటర్: పందిరి మీరాబాయి

ఆంధ్రాభ్యుదయానికి కంకణంకట్టుకున్న పత్రిక కిన్నెర ఆంధ్ర జనానీకం పత్రిక కిన్నెర ఆంధ్ర సేవకై పుట్టిన పత్రిక కిన్నెర మన సంఘం, మన ఆర్థిక జీవనం, ఈ విషమ పరిస్థితులలో ఏవిధంగా పునర్నిర్మాణం కావలసిందీ, మన జీవిత సమస్యలూ, వాటిని యెట్లా పరిష్కరించవలసినదీ వర్ణించే హృదయంగమములైన కథలతోను వినోదాన్ని, విజ్ఞానాన్ని చేకూరుస్తుంది కిన్నెర

భాష సాహిత్యం, శిల్పం, కళ, ఆర్థిక రాజకీయ విషయాలు, శాస్త్ర విషయక వ్యాసాలు, కథలు, నాటికలు మొదలైనవాటితో సర్వాంగ సంపూర్ణంగా ముచ్చటైన ఆకారంతో ప్రకటింపబడుతుంది

విడి కాపీ 6 అణాలు — సంవత్సర చందా 4 రూపాయలు.

మేనేజరు కిన్నెర, 16, జోన్సు స్ట్రీట్, మదరాసు-1.